నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 18 అక్టోబర్ 2024 | NALGONDA

నార్నె రంగారావుకు మాజీ మంత్రి గుంటకండ్ల నివాళి


నార్నె రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 17 : నార్నె సంస్థ ఈస్ట్ సిటీ యాజమాని నార్నె రంగారావు ఇటీవల మృతి చెందగా, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, సురేశ్ తదితరులు ఉన్నారు.

నిధుల్లేవ్.. పనుల్లేవ్

కుంటుపడుతున్న అభివృద్ధి



- ఈ ఏడాది సీడీపీ నిధులకూ దిక్కు లేదు
- ఎస్‌డీఎఫ్ ఫండ్స్ మంజూరైనా పైసా విదిల్చలే..
- అనేక పనులు ప్రతిపాదనలకే పరిమితం
- కనీసం పట్టించుకోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- అనాథగా మారిన యాదాద్రి భువనగిరి జిల్లా
- బీఆర్ఎస్ హయాంలో వెల్లువలా స్పెషల్ ఫండ్స్

పట్టించుకునే వారు లేక యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రగతి కుంటుపడుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో పైసా నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనుల ముచ్చటే లేదు. అనేక పనులు ప్రతిపాదనలకే పరిమితవుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్లిన జిల్లా.. ఇప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోతున్నది.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. భువనగిరి, ఆలేరు రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తిగా ఉండగా.. మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లోని పలు మండలాలు జిల్లా పరిధిలో ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. భువనగిరి నుంచి కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఆలేరు నుంచి బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.

ఎస్‌డీఎఫ్ ఒక్క పైసా విడుదల కాలే..

ఈ ఏడాది స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) ఒక్క పైసా విడుదల కాలేదు. తూ.తూ.మంత్రంగా ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 10 కోట్ల నిధులు మంజూరు మాత్రమే ఇచ్చారు. దీనికి సంబంధించి అధికారులు వివిధ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో 337 వివిధ పనులకు 12.40 కోట్లు అవసరమని గుర్తించగా, కేవలం మంజూరు మాత్రమే ఇచ్చారు. భువనగిరి నియోజకవర్గంలో రూ.1.62 కోట్లతో 66 పనులు, ఆలేరు నియోజవకర్గంలో రూ.4.92 కోట్లతో 128 పనులు, మునుగోడు నియోజకవర్గంలోని రెండు మండలాలకు రూ.1.74 కోట్లతో 86 పనులు, తుంగతుర్తిలో రూ.2.97 కోట్లలో 27 పనులు, నకిరేకల్ నియోజకవర్గంలోని ఒక మండలానికి రూ.1.13 కోట్లతో కేవలం మంజూరు ఇచ్చారు. నిధులు విడుదల కాకపోవడంతో ఏ పని కూడా అడుగు మందుకు పడడం లేదు.

కొత్త ప్రాజెక్టుల్లేవ్..

ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు కొత్త ప్రభుత్వంపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొత్త ప్రాజెక్టులు, నిధులు వస్తాయని ఎదురుచూస్తున్నారు. కానీ ఇప్పటి వరకు జిల్లాకు ఒరిగిందేమీ లేదు. పాత వాటితోపాటు కొత్త కార్యక్రమాల ఊసేలేదు. ఇటీవల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల విషయంలోనూ జిల్లాకు అన్యాయం జరిగింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాకు రెండేసి చొప్పున పాఠశాలలకు శంకుస్థాపన చేయగా, యాదాద్రికి మాత్రం ఒక్కటీ కేటాయించలేదు. గంధమల్ల రిజర్వాయర్ విషయంలోనూ ముందడుగు లేదు. ఆలేరు రెవెన్యూ డివిజన్, భువనగిరి డిగ్రీ కాలేజీ వంటి ఎన్నో హామీలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాకు వచ్చిన ఐఐహెచ్‌టీని తరలించుకుపోతున్నా పట్టించుకునే ప్రజాప్రతినిధులు కరువయ్యారు.

కుంటుపడుతున్న అభివృద్ధి..

ఎమ్మెల్యేల వద్ద నిధులు ఉంటే పలు రకాల అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, భవనాలు, ప్రహరీలు, కమ్యూనిటీ భవనాలు, కమిటీ హాళ్ల వంటి వాటికి నిధులు కేటాయించవచ్చు. కానీ నిధులు రాకపోవడంతో ఏ పని కూడా చేసే పరిస్థితి లేదు. దాంతో పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇటీవల వానకాలంలో ధ్వంసమైన రోడ్లు కనీసం మరమ్మతులకు నోచడం లేదు. అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొన్నా పరిష్కరించేవారు లేరు, ఇక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీల సంగతి దేవుడెరుగు.

బీఆర్ఎస్ హయాంలో భారీగా నిధులు..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాకు నిధులు వరదలా పారాయి. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెంటపడి మరీ నిధులను తీసుకొచ్చారు. సీడీపీతోపాటు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, టీఎయూఎఫ్ఐడీసీ, హెచ్ఎండీఏ నిధులు పెద్దఎత్తున విడుదల చేయించారు. అప్పటి సీఎం కేసీఆర్ తోపాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును ప్రత్యేకంగా కలిసి సమస్యలను విన్నవించడంతోపాటు నిధులను వెంట వెంటనే విడుదల చేయించేందుకు కృషి చేసేవారు. మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ఏకంగా ఒకే దఫాలో రూ.45 కోట్ల స్పెషల్ ఫండ్స్‌ను తీసుకువచ్చి భువనగిరి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టడం అందరికీ తెలిసిందే.

సీడీపీ నిధుల ముచ్చటే లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో సీడీపీ నిధుల ఊసే లేదు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో పలు రకాల అభివృద్ధి పనులకు తమ పరిధిలోనే నిధులు కేటాయించుకునేందుకు ఇవి ఉపయోగపడుతాయి. ఆర్థిక సంవత్సరంలో ఒక నియోజకవర్గానికి రూ.5 కోట్ల సీడీపీ నిధులు ఉంటాయి. ఉమ్మడి రాష్ట్రంలో కోటి మాత్రమే ఉన్న నిధులను బీఆర్ఎస్ హయాంలో రూ.5 కోట్లకు పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు సీడీపీ నిధుల విడుదలే లేదు. కనీసం మంజూరు కూడా కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మార్పు అంటే ఇదేనా..?

కాంగ్రెస్ పార్టీ అలివి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కేవలం పది నెలల్లోనే విఫల ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంది. హామీలు అమలు దేవుడెరుగు. కనీసం ఎమ్మెల్యేల నిధులు కూడా విడుదల చేయకపోవడం దారుణం. ఇలా అయితే అభివృద్ధి ఎలా ముందుకు సాగుతుంది. ఒక్క పైసా కూడా విడుదల చేయకపోవడమేనా ప్రజా పాలనా? కాంగ్రెస్ మార్పు అంటే ఇదేనా? ఇందుకేనా ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించుకున్నది. కొత్త ప్రాజెక్టులు కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు ఉండి ఏం లాభం? వెంటనే అభివృద్ధి నిధులను విడుదల చేయించి, పనులకు శ్రీకారం చుట్టాలి.

– బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు


వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

ఆధ్యాత్మిక సేవతో మానసిక ప్రశాంతత

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, అక్టోబర్ 17 : ఆధ్యాత్మిక, సమాజ సేవలో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టిమర్తి గ్రామంలో గురువారం జరిగిన వేణుగోపాల స్వామి కల్యాణంలో ఆయన ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ప్రతి సంవత్సరం వేణుగోపాలస్వామి ఉత్సవాలకు వచ్చి పూజలు చేస్తానన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లగొండలో గంధం ఎత్తుకొస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మత సామరస్యానికి ప్రతీక లతీఫుల్లా షా ఖాద్రీ ఉర్సు

- రూ.30 కోట్లతో దర్గాకు ఘాట్ రోడ్డు
- ఉత్సవాల ప్రారంభోత్సంలో మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ రూరల్, అక్టోబర్ 17 : నల్లగొండ నడిబొడ్డున జరిగే లతీఫుల్లా షా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మదీనా మసీదులో సాంప్రదాయ ప్రార్థనల అనంతరం గంధం ఊరేగింపుతో ఉత్సవాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడియారం సెంటర్‌లోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షా ఖాద్రీ దర్గాను భక్తులు దర్శించుకునేందుకు వీలుగా రెండు నెలల్లో రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మిస్తామన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యమత్యంతో ఉర్సు జరుపుకొనే సాంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకూ అందించాలన్నారు. నెల రోజుల పాటు సాగే ఉర్సు ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు కృషి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా గంధం ఊరేగింపు సాగింది. గుట్ట మెట్ల దగ్గరికి చేరుకోగానే ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ పార్టీల నాయకులు స్వాగతం పలికి దర్గాపైకి తీసుకెళ్లారు. ముతవల్లీలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గంధం ఊరేగింపులో మార్చా వాయిద్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, గుమ్మల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, ముతవల్లీలు సమీల్లా ఖాద్రీ, హవేజ్, ఉబేజ్ పాల్గొన్నారు.

ఊరుకు కీడొచ్చిందని..!

- ఇండ్లకు తాళం వేసి వనవాసానికి..
- 50 ఏండ్ల తర్వాత ఖాళీ అయిన శెట్టిపాలెం

ఊరు ఖాళీ చేసి వన భోజనాలకు వెళ్తున్న శెట్టిపాలెం గ్రామస్తులు

వేములపల్లి, అక్టోబర్ 17 : ప్రముఖ వాణిజ్య కేంద్రం మిర్యాలగూడ, అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేకు ఆనుకుని ఉన్న గ్రామం శెట్టిపాలెం. సుమారు 6,500 జనాభా గల ఈ గ్రామానికి కీడు వచ్చిందంటూ ఊరుఊరంతా ఇండ్లకు తాళం వేసి గురువారం వనవాసానికి వెళ్లింది. ఏడాది నుంచి ఊళ్లో వరుస మరణాలు చోటుచేసుకుంటుండడంతో గ్రామ పెద్దలు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్రావణ మాసంలో వనభోజనాలు నిర్వహించినప్పటికీ గ్రామస్థులంతా పూర్తి స్థాయిలో చెట్ల కిందకు వెళ్లనందున.. ఈసారి ప్రతి కుటుంబం వనవాసానికి వెళ్లాలని బుధవారం డప్పు చాటింపు వేయించారు. గురువారం ఉదయం కల్లాపి చల్లకుండానే, మొహాలు కడుగకుండానే ఇండ్లకు తాళం వేసి వనవాసానికి వెళ్లారు. గ్రామానికి నాలుగు మూలల రాజేసిన నిప్పు నుంచి ఒక్కో కణికను తీసుకెళ్లి పొయ్యి వెలిగించి చెట్ల కిందే వంటలు చేసుకున్నారు. రోజంతా అక్కడే ఉండి సూర్యాస్తమయం తర్వాత ఊళ్లోకి చేరుకుని ఇండ్లను శుద్ధి చేసుకున్నారు.

50 ఏండ్ల కిందట ఇలాగే..

వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో 50 ఏండ్ల క్రితం ఇలాగే వరుస మరణాలు చోటు చేసుకున్నట్లు గ్రామానికి చెందిన వృద్ధులు తెలిపారు. అప్పట్లో గ్రామ పెద్దల తీర్మానం మేరకు ఇలాగే ఊరు ఖాళీ చేసి వెళ్లినట్లు తెలిపారు. ఊరుకు ఆవల వంటల చేసుకుని సాయంత్రం తిరిగి ఇండ్లకు వచ్చినట్లు గుర్తుచేసుకున్నారు.

ఇంటికి తాళం

కొండపైన సిద్ధమవుతున్న షెడ్

కొండపైన వృద్ధులకు ప్రత్యేక షెడ్

యాదగిరిగుట్ట, అక్టోబర్ 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన వృద్ధులు, దివ్యాంగులు సేద తీరేందుకు దేవస్థానం అధికారులు ప్రత్యేకమైన షెడ్డును నిర్మిస్తున్నారు. స్వామివారి దర్శనానికి బ్యాటరీ వాహనంపై వెళ్లే వృద్ధులు, దివ్యాంగులు, రోగులు వీఐపీ పార్కింగ్‌కు ఎదురుగా వేచి చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ ఎలాంటి వసతి కూడా లేకుండా ఎండ, వానకు ఇబ్బంది పడుతున్నారు. దాంతో వీఐపీ పార్కింగ్‌కు ఎదురుగా 11 ఫీట్ల వెడల్పుతో భక్తులు కూర్చునే విధంగా షెడ్డును నిర్మిస్తున్నారు. శనివారంలోగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

దిగొచ్చిన సర్కారు

- కళాశాలల బంద్ తాత్కాలికంగా విరమణ
- టీపీడీపీఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి
- నేటి నుంచి ప్రైవేట్ కాలేజీలు పునఃప్రారంభం
- నాలుగోరోజూ అంతటా కొనసాగిన నిరసనలు

సూర్యాపేటలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల బైక్ ర్యాలీ

రామగిరి, అక్టోబర్ 17 : ప్రైవేట్, పీజీ కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని నాలుగు రోజులపాటు చేపట్టిన బంద్‌ను తాత్కాలికంగా విరమించినట్లు టీపీడీపీఎంఏ ఎంజీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఫీజు రియంబర్స్‌మెంట్‌కు సంబంధించి ప్రీజింగ్‌లో పెట్టిన టోకెన్లను వారంలో విడుదల చేస్తామని ప్రిన్సిపాల్ సెక్రెటరీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీఎంతో చర్చించి తర్వలో గ్రీన్ చానల్‌తో అందచేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిరసనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి కళాశాలలను తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాగా, గురువారం ఉదయం సూర్యాపేట, భువనగిరి జిల్లా కేంద్రాల్లో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు పెద్దఎత్తున బైక్ ర్యాలీ తీసి నిరసన తెలిపాయి.

నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో మహాత్మా గాంధీ విగ్రహానికి యూనియన్ నాయకులు మారం నాగేందర్‌రెడ్డి, కె.రామ్మోహన్, పి.నర్సింహారెడ్డి, గుండెబోయిన జానయ్య వినతి పత్రం అందించారు.

100 మందికి ముగ్గురే విద్యార్థినులు

- మోత్కూరులో మెనూ పాటించని సంక్షేమ హాస్టళ్లు
- ఆకస్మిక తనిఖీలో బయటపడ్డ అధ్వాన పరిస్థితులు
- అందుబాటులో లేని సంక్షేమాధికారులు

మోత్కూరు : బీసీ బాలుర వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకపోవడంపై వంట మనిషిని ప్రశ్నిస్తున్న తాసీల్దార్ రాంప్రసాద్

మోత్కూరు, అక్టోబర్ 17 : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు అధ్వానంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థులకు సరైన భోజనం కూడా అందడం లేదు. గురువారం పట్టణంలోని ఎస్సీ బాలికలు, బీసీ బాలికలు, బాలుర సంక్షేమ హాస్టళ్లను తాసీల్దార్ రాంప్రసాద్, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో 100 మంది విద్యార్థినులకు గానూ ముగ్గురే ఉన్నారు. బీసీ బాలుర వసతి గృహంలో 12 మంది ఉన్నారు. ఎక్కడా మెనూ పాటించడం లేదు. ఉన్న కొద్దిమందికి కూడా సరిపడా కూరలు చేయలేదు. బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో ఇద్దరే విద్యార్థులు ఉన్నారు. సంక్షేమాధికారులు అందుబాటులో లేరు. ఎస్సీ బాలికల వసతి గృహంలో ఐదుగురు వంట మనుషులకు ఆనూ ముగ్గురే విధుల్లో ఉన్నారు. బీసీ బాలికల వసతి గృహంలో అసలు పిల్లలే లేరు. ఇన్‌చార్జి వార్డెన్ విధులకు రెగ్యులర్‌గా హాజరు కావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. వసతి గృహాల్లో వార్డెన్లు అందుబాటులో లేకపోవడం, పిల్లలు లేకపోవడం, మెనూ పాటించకపోవడంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు తాసీల్దార్ డి.రాంప్రసాద్ తెలిపారు.

రాష్ట్రాలు దాటుతున్న రేషన్ బియ్యం

- ఏపీ నుంచి ముంబైకి రవాణా
- వాడపల్లి వద్ద 504క్వింటాళ్ల బియ్యం సీజ్.. నిందితుల అరెస్ట్
- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండలో వివరాలు తెలుపుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, అక్టోబర్ 17 : ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల కేంద్రంగా రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. 504 క్వింటాళ్ల బియ్యం, తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేశారు. అందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం మీడియాకు వివరించారు. దామరచర్ల మండలంలోని వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా ఏపీ నుంచి తెలంగాణ వైపు వస్తున్న లారీని ఆపారు. అందులో 254.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 30 కిలోల బ్యాగుల్లో నింపి తరలిస్తున్నట్లు గుర్తించారు. అదే సమయంలో వచ్చిన మరో లారీలో 250 క్వింటాళ్ల రేషన్ బియాన్ని గుర్తించి.. రెండు వాహనాలను సీజ్ చేశారు. బాపట్ల జిల్లాకు చెందిన చీమకుర్తి సుధాకర్ గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలో పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన రైస్‌మిల్లులో పాలిష్ చేస్తున్నాడు. అనంతరం సాధారణ బియ్యంగా మార్చి 25, 30కిలోల బ్యాగుల్లో నింపి గుంటూరుకు చెందిన అశోక్ సాయంతో నకిలీ బిల్లులు సృష్టించి తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌కు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అశోక్, సుధాకర్ నుంచి కర్నాటకకు చెందిన బియ్యం వ్యాపారి సయ్యద్ సలావుద్దీన్ బియ్యం కొనుగోలు చేసి రెండు లారీల్లో ముంబైకి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను పట్టుకున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ రవికుమార్‌ను ఎస్పీ అభినందించారు.

ఎల్లుండి రామన్నపేట సబ్‌కోర్టు ప్రారంభం

- ఏడు మండలాలకు ప్రయోజనం

రామన్నపేట, అక్టోబర్ 17: రామన్నపేటలో సబ్ కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ నెల 19న సీనియర్ సివిల్ జడ్జి (సబ్ కోర్టు) కోర్టును ప్రారంభించనున్నారు. ప్రస్తుతం రామన్నపేటలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే సబ్ కోర్టు పరిధిలోకి రామన్నపేట, చౌటుప్పల్, పోచంపల్లి, మోత్కూరు, అడ్డగూడూరు, వలిగొండ, సంస్థాన్‌నారాయణపురం రెవెన్యూ మండలాలు రానున్నాయి.

ఈ కోర్టులో పదేండ్లకు పైగా శిక్షపడే అవకాశం ఉన్న కేసులు, విడాకులు, రూ.50లక్షల్లోపు విలువగల సివిల్ కేసులను పరిష్కరించనున్నారు. హైకోర్టు పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ జువ్వాజి శ్రీదేవి, హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ నూతన కోర్టును ప్రారంభించనున్నారు. రామన్నపేటకు సబ్ కోర్టు మంజూరుపై ఏడు మండలాల ప్రజలు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబ్ జైలుకు తాసీల్దార్ జయశ్రీ

- ముగిసిన పోలీస్ కస్టడీ

హుజూర్‌నగర్, అక్టోబర్17 : ప్రభుత్వ భూములను అక్రమంగా ఇతరుల పేరుపై బదిలీ చేసి ఆ భూములపైన వచ్చిన రైతు బంధు నగదును కాజేశారనే ఆరోపణలతో హుజూర్‌నగర్ గత తాసీల్దార్ జయశ్రీ అరెస్ట్ చేసి సబ్ జైలుకు తరలించిన విషయం విదితమే. మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తాసీల్దార్ జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను కోర్టు అనుమతిని ఇచ్చిన నేపథ్యంలో మూడు రోజుల పాటు పోలీసులు విచారణ కొనసాగించారు. ప్రభుత్వ భూముల పక్క దారి పట్టించిన కేసు, హుజూర్ నగర్, గరిడేపల్లి మండలాల్లో పక్క దారి పట్టిన వందల కోట్ల విలువైన భూములపైన విచారించినట్లు సమాచారం. కరోనా సమయంలో హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో పంపిణీ చేసిన ఇండ్ల స్థలాల పైన, కోదాడలో తన కున్న ఆస్తులపైన విచారించారు. రైతుబంధులో జరిగిన అవకతవకలను తాసీల్దార్ ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. మూడు రోజుల పోలీసుల విచారణ అనంతరం గురువారం తాసీల్దార్ జయశ్రీని, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను సబ్ జైలుకు తరలించినట్లు సమాచారం.

గుర్రంపోడు మహిళ హత్య ఘటనలో సీఐకి మెమో

- కానిస్టేబుల్ సత్యనారాయణ సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ

గుర్రంపోడ్, అక్టోబర్ 17: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో ఆగస్టు 29న జరిగిన జాల రజిత హత్య కేసు విచారణను సరిగా నిర్వహించనందుకు గానూ కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు చార్జిమెమో జారీ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హత్య కేసును ఆత్మహత్యగా మార్చే ప్రయత్నం చేయడం, సహ నిందితులను తప్పించారనే ఆరోపణలపై ఈ నెల 14న ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని సస్పెండ్ చేసిన విషయం విదితమే. నిందితుల నుంచి డబ్బులు తీసుకొని ఎస్ఐకి అప్పగించిన కానిస్టేబుల్ సత్యనారాయణను కూడా సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.